


ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-బొబ్బిలి

క్రిస్మస్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి పట్టణంలోని సిబిఎం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పాల్గొని కేక్ కట్ చేశారు. ఆర్‌సిఎం, బాప్టిస్ట్, ఇతర చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు చేశారు.



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

చంద్రబాబు సక్సెస్

- భారీగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు
- రవాణా, ఖర్చులకు భారీగా గుమ్మరించిన నాయకులు
- ఆకాశమే హద్దుగా విమర్శలు చేసిన బాబు



బొబ్బిలి రోడ్‌షోలో టిడిపి శ్రేణులకు అభివాదం చేస్తున్న అధినేత చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో 22వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 'ఇదేం కర్మ' పేరిట సాగిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతమైంది. సభలకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివచ్చారు. రహదారి పొడవునా ఎక్కడికక్కడ టిడిపి అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాలలు, హారతి, తిలకాలతో బాబుకు ఆశీర్వచనాలు అందించారు. డప్పుల దరువులు, తప్పెటగుళ్లు, బాణసంచా పేలుళ్లతో మూడు రోజులపాటు బాబు తిరిగిన ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. ఇందుకోసం ఆయా ప్రాంతాల నాయకులు భారీ సమీకరణాలు చేపట్టారు. గ్రామాలను యూనిట్‌గా తీసుకుని ప్రయాణ ఏర్పాట్లు చేశారు. దారిఖర్చులు కూడా ఇవ్వడంతో తమ్ముళ్లలో జోష్ పెరిగింది. విజయనగరంలో జరిగిన సభకు గజపతినగరం, శృంగవరపుకోట, నెల్లిమర్ల నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించారు. భారీగా తరలివచ్చిన జనాన్ని చూసిన చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆకాశమే హద్దుగా ఉన్నవీ లేనివీ కలగలిపి ప్రసంగించారు.

మరోవైపు వచ్చే ఎన్నికల్లో పార్టీ నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకులంతా బాబు దృష్టిలో పడేందుకు ప్రయత్నించారు. బాబు మాత్రం ఆయా నియోజకవర్గాల్లో తిరిగినప్పుడు తన పక్కన ఒకరికి మాత్రమే స్థానం ఇచ్చారు. రాజాం నియోజకవర్గంలో బాబును ఆకర్షించేందుకు ఓవైపు మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఆమె కుమార్తె గ్రీష్మ, మరోవైపు మాజీ మంత్రి కొండ్రు మురళి పోటీపడ్డారు. రోడ్‌షో, బహిరంగ సభలో కొండ్రు మరళికే కీలక స్థానం దక్కింది. ఇటు బొబ్బిలిలో మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు కన్నా ఆయన సోదరుడు బేబినాయనకు ప్రాధాన్యత లభించింది. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడును టార్గెట్ చేస్తూ కరణం శివరామకృష్ణను జిల్లాకు చెందిన కీలక నేత అశోక్ గజపతిరాజు ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు ఉన్న విషయం విదితమే. పర్యటనలో చంద్రబాబు పక్కన కె.ఎ.నాయుడుకు మాత్రమే స్థానం దక్కింది. అదే శివరామకృష్ణను విజయనగరం బహిరంగ సభలో వేదికపైకి ఎక్కించడం, బాబు ఆగ్రహంతో వెనక్కి తగ్గడం చర్చనీయాంశంగా మారింది. కెఎ నాయుడి బలాన్ని తక్కువ చేసేందుకు గజపతినగరానికి చెందిన కేడర్ స్థానికంగా లేకుండా చేసి, విజయనగరానికి తరలించారన్న విమర్శలు కూడా ఉన్నాయి. విజయనగరంలో బాబు పక్కన తొలి ప్రాధాన్యత అశోక్‌కి మాత్రమే దక్కింది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేసిన అదితి గజపతిని రెండు స్థానంలోకి నెట్టడంతో ఈ సారి అశోక్‌ను అసెంబ్లీ బరిలో దింపే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి, జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స, ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌ఛార్జులు విజయసాయిరెడ్డి, వైవి సుబ్బారెడ్డిపైనే చంద్రబాబు విమర్శలు గుప్పించారు. వైసిపి నాయకుల సంగతి తేలుస్తాం.... బట్టలూడదీసి బజారుకీడుస్తాం, సిఎం జగన్‌ను సైకో.. అంటూ సంబోధించడం, తీవ్ర పదజాలంతో అవినీతి, అక్రమాల ఆరోపణలు చేయడం పట్ల అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రి బొత్స అభ్యంతరం వ్యక్తం చేస్తూ సమావేశాలు నిర్వహించారు. బాబు పాలనలో జిల్లాకు చేసిందేమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేసినప్పటికీ ఆ దిశగా వివరించడంలో చంద్రబాబు విఫలమయ్యారు. వైసిపి హయాంలో చేపట్టిన మెడికల్ కాలేజీని కూడా బాబు తనఖాతాలో వేసుకుని అధికార పార్టీపై తిట్లపురాణం గుప్పించడంతో తెలుగు తమ్ముళ్ల నాలుక కరుసుకున్నారు. ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న తోటపల్లి సాగునీటి ప్రాజెక్టును తానే పూర్తిచేశానంటూ ప్రగల్భాలు పలకడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం మూడు బహిరంగ సభల్లోనూ ఒకటే పాట అన్నట్టుగా ప్రసంగించడంతో ఆ పార్టీ క్రియాశీలక కార్యకర్తలకు సైతం రుచించలేదు. టిడిపి హయాంలో మూతపడ్డ జ్యూట్‌మిల్లులు, చక్కెర పరిశ్రమలను తిరిగి తెరిపిస్తానంటూ మాట ఇవ్వడం కొసమెరుపుగా చెప్పుకుంటున్నారు.



ట్రోఫీని అందుకుంటున్న విజయనగరం జట్టు

వాలీబాల్ విజేత విజయనగరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యలమంచిలిలో జరుగుతున్న సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. ఆదివారం శ్రీకాకుళం జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 3-2 సెట్ల తేడాతో విజయం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. అంతకు ముందు సెమీఫైనల్‌లో ప్రకాశం జట్టును ఓడించింది. విజేతగా నిలిచిన విజయనగరం బాలుర జట్టును రాష్ట్ర కార్యదర్శి భగవాన్ దాస్, జిల్లా అధ్యక్షులు కృష్ణంరాజు, కోచ్‌లు సూరిబాబు, కెవిఎన్ రాజు అభినందించారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఆత్మరక్షణ క్రీడలు దేహ దారుఢ్యానికి, సమయస్ఫూర్తికి ఎంతగానో ఉపయోగపడతాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విన్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే కోచ్‌ల శిక్షణ వాల్ పోస్టర్లను ఆదివారం తన నివాసంలో కోలగట్ల విడుదల చేశారు. ఇలాంటి కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. నిర్వాహకులు రవి మండ, వి.ఆనంద చౌదరి, కోచ్ వినేష్ మాట్లాడుతూ జనవరి 6, 7, 8 తేదీల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 300 మంది క్రీడాకారులు పాల్గొననున్నారని చెప్పారు.

చంద్రబాబు, అశోక్ సమాలోచన

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలోని అశోక్ బంగ్లాలో ఆదివారం ఉదయం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు సమాలోచన చేశారు. చంద్రబాబు జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగించుకుని శనివారం రాత్రి అశోక్ బంగ్లాలో రాత్రి బస చేశారు. ఆదివారం విశాఖ ఎయిర్‌పోర్టుకు బయల్దేరే ముందు పలువురు నాయకులు చంద్రబాబును కలిశారు. కొంతసేపు అశోక్‌తో జిల్లా రాజకీయ అంశాలపై చర్చించారు. అశోక్ వెంట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు కూడా ఉన్నారు.



చంద్రబాబుతో చర్చిస్తున్న అశోక్

2024 మార్చి నాటికి ఇంటింటికీ కుళాయి పనులు పూర్తి

- జెజెఎం నిధులు రూ.901 కోట్లు మంజూరు
- జిల్లాలో అందరికీ సురక్షిత తాగునీరు
- నిర్ణయించిన సమయానికి జగనన్న కాలనీల పనులు పూర్తి
- 'ప్రజాశక్తి'తో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్ ముఖాముఖి



'జిల్లాలో ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి పనులను 2024 మార్చి నాటికి పూర్తి చేయడానికి గ్రామ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ కుళాయిల పనులు అదే సమయానికి పూర్తయ్యే అవకాశముంది. అందులో భాగంగానే సిబ్బందిని కూడా సన్నద్ధం చేశామ'ని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య పర్యవేక్షక ఇంజినీర్ బి.ఉమాశంకర్ వెల్లడించారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

\- ప్రజాశక్తి, విజయనగరం

జిల్లాలో తాగునీటి సరఫరాకు ఉన్న వనరులు ఏమిటి?.

జిల్లాలోని 27 మండలాల పరిధిలో ఉన్న 777 గ్రామ పంచాయతీల్లో 1621 గ్రామాల ప్రజలకు 30 సిపిడబ్ల్యు పథకాలు, 924 పిడబ్ల్యుఎస్ పథకాలు, 184 ఎంపిడబ్ల్యుఎస్ పథకాలు, 408 డైరెక్ట్ పంపింగ్ స్కీములు, 14,484 చేతిబోరుల ద్వారా తాగునీరు అందిస్తున్నాం.

జల జీవన మిషన్ కింద ఎన్ని పనులు మంజూరు అయ్యాయి? విడుదలైన నిధులు?.

జిల్లాకు జల జీవన్ మిషన్ ద్వారా మొదటి విడతలో రూ.200.08 కోట్లతో 1111 పనులు మంజూరయ్యాయి. ఇందులో 2,26,830 కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలు మంజూరయ్యాయి. ఇంతవరకు 645 పనులు పూర్తి చేసి 1,20,476 కుటుంబాలకు ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశాం. రెండో విడతలో రూ.701.70 కోట్లతో 1,99,387 కుటుంబాలకు 1300 పనులు మంజూరయ్యాయి. వీటి ద్వారా జిల్లాలో ఉన్న ప్రతి కుటుంబానికీ ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తాం.



జల జీవన మిషన్ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?.

జిల్లాలో జల జీవన మిషన్ ద్వారా చేపడుతున్న పనుల్లో మొదటి విడతలో పనులు సగానికి పైగా పూర్తయ్యాయి. మిగతావి ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. రెండో విడతలో మంజూరైన పనులు 2024 మార్చి నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు మంజూరైన నిధులెంత?.

జిల్లాలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద శాశ్వత వసతులు కల్పించేందుకు రూ.138.81 కోట్లతో 734 పనులు మంజూరయ్యాయి. ఇంతవరకు 156 పనులు ప్రారంభం కాగా అవి వివిధ దశల్లో ఉన్నాయి. మరో 261 పనులు టెండర్ దశలో ఉన్నాయి. మిగతా పనులు కూడా త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇల్లు కట్టుకోవడానికి అవసరమైన నీటి వసతి కల్పించేందుకు రూ.33.84 కోట్లతో 30,248 ప్లాట్లకు 716 పనులతో నీటి వసతి కల్పించాం.

జిల్లాలో ఎన్ని సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు?.

జిల్లాలో ఉన్న ప్రతి పంచాయతీలో సర్వే చేసి నీటి నిలువ ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించాం. అందులో భాగంగా జిల్లాలో రూ.15.90 కోట్ల స్వచ్ఛభారత్ నిధులతో ప్రతి సచివాలయ పరిధిలో 530 సామాజిక మరుగుదొడ్లను నిర్మించాలన్నది లక్ష్యం. ఇంతవరకు 317 వరకు పూర్తయ్యాయి. మిగతావి కూడా త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద ఎన్ని పనులు మంజూరయ్యాయి?.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జిల్లాలో రూ.7.06 కోట్లతో 251 పనులు మంజూరయ్యాయి. వీటిని తొందరలోనే ప్రాంభించడానికి ప్రయత్నిస్తున్నాం. ఇందులో డ్రెయిన్లు ఎక్కువగా ఉన్నాయి.

జిల్లాలో ఎన్ని ల్యాబ్‌లు ఉన్నాయి?.

జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు గాను ఆరు ల్యాబ్‌లు ఉన్నాయి. వీటి ద్వారా మంచి నీటి పథకాల బోర్లను పరీక్షించి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. డబ్ల్యుఎస్ ద్వారా చేపడుతున్న పనులు సకాంలో పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నాం.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

నాగావళి నదిని దోచేస్తున్న ఇసుకాసురులు



ట్రాక్టర్‌తో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతాలైన సంకిలి, తునివాడ, రేగిడి తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. ఆయా గ్రామాలలో నాగావళి నదిలో జెసిబిని దించి ఇసుకను ట్రాక్టర్లకు ఎత్తి అక్కడి నుంచి రాజాం, విజయనగరం తదితర పట్టణాలకు అధిక ధరలకు విక్రయాలు చేపడుతున్నారు. ఇసుకాసురులు అక్రమ రవాణాతో లక్షల్లోనే వెనకేసుకుంటున్నారు. రాత్రి సమయాల్లో మరీ విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినా మామ్మూళ్ల మత్తులో అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మరి కొంతమంది ఎడ్ల బల్లులో ఇసుక తెచ్చి తోటల్లోనూ, లొంగ గుడ్డల్లోనూ డంపింగ్ చేసి రాత్రి సమయాల్లో ట్రాక్టర్లు, లారీలతో పట్టణాలకు తరలించేస్తున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాకు అడ్డ కట్టలేదని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

బక్కచిక్కిన నాగావళి నది

అక్రమ ఇసుక రవాణా వల్ల నాగావళి నది బక్కచిక్కిపోయింది. రేయింబవళ్లు నాగావళి నదిని దోచేయడంతో ఎక్కడికక్కడ గోతులమయమైంది. మండలంలో నాగావళి నదికి ఇసుక ర్యాంపు మంజూరు లేకపోవటంతో అక్రమ పద్ధతిలో ఇష్టానుసారంగా ఇసుకను తరలించేస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతోనే రెచ్చి పోతున్న అక్రమార్కులు నాగావళిని దోచేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాలలో రాజాం- పాలకొండ ప్రధాన రహదారిలో పర్యవేక్షణ లేకపోవడంతోనే విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతుందని పలువురు విమర్శిస్తున్నారు. పట్టపగలు కూడా ఈ రహదారి గుండా ఇసుక ట్రాక్టర్లతోనూ, లారీలతోనూ అక్రమంగా తరలిపోతున్న పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్, రెవెన్యూ అధికారులు స్పందించి పర్యవేక్షణ జరిపి అక్రమంగా తరలిస్తున్న ఇసుకకు అడ్డకట్ట వేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవినీతి, అభివృద్ధిపై చర్చకు సిద్ధం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతి, అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఓటమి భయంతోనే అసత్యాలు, మోసపు మాటలు చంద్రబాబు చెప్పారన్నారు. మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు జిల్లా పర్యటన సాగిందన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏం చేశారో చెప్పలేని స్థితిలో జిల్లా పర్యటన సాగిందన్నారు. సైకిల్ పోవాలన్న చంద్రబాబు వ్యాఖ్యలు నిజమైనా, ఇంకా బుద్ధి రాలేదా? అని ప్రశ్నించారు. మంత్రి, ఎమ్మెల్యే ఓడిపోవాలన్న చంద్రబాబు.. తమ గెలుపు సంగతి పక్కనపెట్టి, కుప్పంలో గెలవగలరా? అని సవాల్ చేశారు. గడపగడపకు వెళ్లి పథకాల గురించి అడగగలరా? అని ప్రశ్నించారు. ప్రజల్లో రాజకీయ అవగాహన వచ్చిందని, ఏ కుట్రలు చేసినా ప్రజలు మరోమారు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భూముల కబ్జా, అవినీతి చేశామంటున్న చంద్రబాబు దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. విశాఖను పరిపాలన రాజధానిగా వద్దని చెప్పి, ఆర్థిక, ఐటి రాజధాని చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అశోక్ గజపతిరాజును ఎందుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పెడుతున్నారని, తనతో ఇంకెవరూ పోటీకి సరికారనే భయంతో అలా నిర్ణయించారని, అది చంద్రబాబు ఓటమికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. సమావేశంలో వైసిపి నాయకులు అశపు వేణు, ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

సైకిల్ పోవాలన్న చంద్రబాబు కోరిక నెరవేరుస్తాం

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విలేకర్లతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


సైకిల్ పోవాలన్న చంద్రబాబు వ్యాఖ్యలను జిల్లా ప్రజలు తప్పకుండా నెరవేరుస్తారని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు మూడు రోజుల జిల్లా పర్యటన అబద్ధాలు, మోసపు మాటలతో సాగిందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఎన్‌టిఆర్ గుర్తుకువస్తారని, అది చంద్రబాబుకు అలవాటుగా మారిందని చెప్పారు. తనపై చంద్రబాబు చేసిన ఆరోపణలు నిరూపించాలన్నారు. ఓటమి పాలైన తరువాత అశోక్ గజపతి, సుజయ్ ప్రజల్లో ఎప్పుడూ కనిపించలేదని, మూడున్నరేళ్లు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అశోక్ నీతి, నిజాయతీ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కోర్టుల్లో 150 కేసులు ఉంటే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే శంకుస్థాపనల ముఖ్యమంత్రిగా చంద్రబాబుకు పేరుందని ఎద్దేవాచేశారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయలేదని ఏ ఒక్క రైతు అయినా చెప్పారా? అంటూ నిలదీశారు. కరువు, బాబు కవల పిల్లలని, టిడిపి హయాంలో రైతులు ఎక్కడైనా బాగు పడ్డారా? అని ప్రశ్నించారు. లంచాలు, సిఫార్సులు తమ ప్రభుత్వంలో లేవన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు సూర్యనారాయణరాజు, నారాయణ మూర్తి రాజు పాల్గొన్నారు.

అతిపెద్ద దోపిడీదారు, కబ్జాకోరు చంద్రబాబే

ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

గజపతినగరం : అతిపెద్ద దోపిడీదారు, కబ్జాకోరు చంద్రబాబేనని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజుల చంద్రబాబు పర్యటనలో ప్రభుత్వాన్ని, తమ కుటుంబాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారే తప్ప టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి గురించి చెప్పిన దాఖలాలు లేవన్నారు. చంద్రబాబు హయాంలో షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసి, దానిలో ఐదు కోట్ల రూపాయలను టిడిపి నాయకులు, చంద్రబాబు దోచుకున్నారన్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అధికారం ఉందని దేనికీ పనికిరాని చంద్రబాబు కొడుకు ముద్దపప్పును పంచాయతీరాజ్ మంత్రిని చేసి కాంట్రాక్టర్ల వద్ద నుండి ప్యాకేజీ రూపంలో పదిశాతం కమీషన్ నొక్కేసింది వాస్తవం కాదా? అని నిలదీశారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి గజపతి నగరం ఎమ్మెల్యే ఉద్యోగాలను కాసులకు అమ్ముకున్నది కనిపించలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో జెడ్‌పిటిసి గార తవుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, వైస్‌సర్పంచ్ మండల సురేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ఉత్తరాంధ్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాకేష్ రెడ్డి



ప్రజాశక్తి-విజయనగరంకోట

కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.రాకేష్ రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ ప్రకటించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాకేష్‌రెడ్డి నియామకంపై హర్షం వ్యక్తంచేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కిశోర్



కిశోర్‌తో కోచ్ ప్రసాద్

ప్రజాశక్తి-బొబ్బిలి

కాకినాడలో సోమవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు బొబ్బిలి నుండి యువ కిశోర్ హాజరుకానున్నట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ నెల 23న విజయనగరంలో రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో కిశోర్ సత్తాచాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కిశోర్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అభినందించారు.

అంగన్వాడీ సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం యూనియన్ బొబ్బిలి అర్బన్ సెక్టార్ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలతో చాకిరీ చేయించుకుని రిటైర్మెంట్ బెనిఫిట్, పెన్షన్ సౌకర్యం, కనీస వేతనం ఏవీ అమలు చేయడం లేదన్నారు. మరోవైపు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడానికి పాలకులు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. వెంటనే అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై జనవరి 9న తహశీల్దార్ కార్యాలయాలు, 25, 26, 27న ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నాలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 6 కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో యూనియన్ అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షులు జె.కామేశ్వరి, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.

నేడు బల్లంకిలో గడపగడపకు..

వేపాడ : మండలంలోని బల్లంకి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైసిపి అధ్యక్షుడు ఎం. జగ్గు బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరుకానున్నారని చెప్పారు. మండలంలో గల ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చింతలవలసలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

డెంకాడ : మండలంలోని చింతలవలస గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆదివారం మాజీ కేంద్ర మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు ఆవిష్కరించారు. చింతలవలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పిన్నింటి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం ఇంఛార్జి పతివాడ నారాయణ స్వామి నాయుడు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, భోగాపురం మాజీ ఎంపిపి కర్రోతు బంగార్రాజు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్ రావు, ఐవీపీ రాజు, పతివాడ తమ్మినాయుడు, కర్రోతు సత్యనారాయణ, పతివాడ తారక రామానాయుడు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, పడాల చిన్నారావు, చిల్ల పద్మ, బీశెటి సుహాసిని, పాలు శ్రీను, సవరపల్లి సత్యవతి, సవరపల్లి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

డెంకాడ : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఆదివారం అమకాం సచివాలయం పరిధిలోని వెంకన్న పేట, దిబ్బగుడ్డి, గొల్లపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు రొంగలి కనక సింహాచలం, సర్పంచులు, ఎంపిటిసిలు, రాష్ట్ర డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నెంబరు 14567పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సింహాచలం

గుర్ల : మండలంలోని గోషాడ గ్రామంలో ఆదివారం హెల్ప్‌ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ జె. సింహాచలం అధ్యక్షతన టోల్‌ఫ్రీ నెంబర్ 14567 పైన అవగాహన కల్పించారు. ఈ ఫోన్ నెంబర్‌కి వృద్ధుల సమస్యలు తెలియ చేయ వచ్చు అన్నారు. వృద్ధులను హింసించినా, ఇంటి నుండి బయటకు గెంటి వేసినా వారికి రక్షణ కల్పిస్తామన్నారు. పింఛన్, చట్టపరమైన సమస్యల్లో సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. భావోద్వేగాల విషయాలను తమతో పంచుకునేందుకు నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


జెడ్‌పిటిసి సొంత నిధులతో కోనేరు అభివృద్ధి


గ్రామస్తులతో చర్చిస్తున్న జెడ్‌పిటిసి సన్యాసినాయుడు

నెల్లిమర్ల : కొండవెలగాడలో జెడ్‌పిటిసి కోనేరును తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు అన్నారు. ఆదివారం కోనేరు అభివృద్ధి పనుల్లో భాగంగా గట్టు మీద తుప్పలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ కోనేరు అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పార్కు, పాదచారులు సేద తీరేలా బెంచీలు, ఐలాండ్, నీటి తుంపర పార్కు తదితర అభివృద్ధి పనులు జరిపిస్తామని తెలిపారు. అనంతరం కోనేరు పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'చంద్రబాబు సభ విజయవంతం'

గజపతినగరం : జిల్లా పర్యటనలో భాగంగా గజపతినగరంలో చంద్రబాబు సభను విజయవంతం చేసిన టిడిపి అభిమానులు, నాయకులకు కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన టిడిపి కార్యాలయంలో మాట్లాడారు. ఛీపురుపల్లి సింగా ప్రాజెక్టు గత రెండు సంవత్సరాలుగా కండిషన్ బాగోలేదని మూసివేస్తే స్థానిక ఎమ్మెల్యే చెరకు రైతుకు తీవ్ర ఇబ్బందులు గురి చేశారని టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని మరలా తాము అధికారంలోకి రాగానే ఆ ప్యాక్టరీని తిరిగి ప్రారంభించి చెరకు రైతులను ఆదుకుంటామని హామీ ఇవ్వడం హర్షించ దగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వం మారినప్పుడు రూ.10.55 కోట్లు నిధులతో ప్యాక్టరీని గత కాంగ్రెస్ పాత బకాయిలను తీర్చి, కొన్ని వేల చెరకు రైతుల కుటుంబాలకు బాసటగా ఉన్న ప్యాక్టరీని రివర్స్ టెండరింగ్ ద్వారా మిగతా డబ్బును వెనక్కి తీసుకోవడం చెరకు రైతుల నోట్లో మట్టి కొట్టడమే అని అన్నారు. నిన్న జరిగిన సభను బట్టి 2024లో గజపతినగరం నియోజకవర్గంలో టిడిపికే ప్రజలు మరోక్కసారి బ్రహ్మరథం పడతారని వైయస్సార్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారని జోస్యం పలికారు. ఈ సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అట్టాడ లక్ష్మున నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


శుభకార్యంలో పాల్గొన్న జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

శుభకార్యాలకు హాజరైన జెడ్‌పి చైర్మన్

వేపాడ : మండలంలోని బొద్దాం, పెదలపేపురం గ్రామాల్లో ఆదివారం జరిగిన పలు శుభ కార్యాలకు (రజస్వల) జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయనతో పాటు స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేపాటి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సమగ్ర భూసర్వే

వేపాడ : మండలంలోని సమగ్ర భూసర్వే చేస్తున్న సిబ్బందిపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు గ్రామాలలో చేపట్టిన సమగ్ర భూసర్వే ఆ గ్రామాలలో రైతులకు ఇవ్వకుండా గోప్యంగా ఉంచడం, ఏవి భూములు సర్వే చేపట్టడం జరిగిందన్న వివరాలు ఇంతవరకు రైతులకు చెప్పకపోవడంపై పెదవి విరుస్తున్నారు. ఈ సర్వే వల్ల రైతులకు ప్రయోజనం ఎంత మేరకు ఉంటుందో అర్థం కాక సర్వే బృందానికి ఆ గ్రామాలలో రైతులు పూర్తి సహకారం అందించకుండా మొఖం చాటేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో సర్వే బృందం సమగ్ర భూ సర్వేకి వెళ్లే ముందు రోజు ప్రకటన రూపంగా తెలియజేస్తే ప్రభుత్వం ఆశ సెరవేరుతుందని లేకుంటే ఈ భూ సర్వే వల్ల ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు.

రైతులకు రవాణా పాట్లు

● ట్రాన్స్‌పోర్టు పేరిట అన్నదాతను లొంగదీసుకుంటున్న మిల్లర్లు ● వారికే అనుకూలంగా కస్టోడియన్ అధికారులు ● ధాన్యం కొనుగోలులో కొనసాగుతున్న దందా

ప్రజాశక్తి- జామి

'తినమరిగిన కోడి ... ఇళ్లెక్కి కూసింది' అనే సామెతకు మన జిల్లాలో మిల్లర్ల వ్యవహారిక శైలి అద్దం పడుతుంది. రైతుల నుంచి అధనపు ధాన్యాన్ని ముక్కుపిండి వసూలు చేస్తూ, తాము పట్టిన కుందేలకు మూడే కాళ్ళు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ధాన్యం కొనుగోలులో రైతులు ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్ పోర్టును అవకాశంగా తీసుకుని, అధనపు ధాన్యం ఇస్తే తప్పా, ధాన్యం దించుకోమని మొండికేస్తున్న పరిస్థితి. రైతులు అని వార్యంగా రవాణా ఖర్చుల భారానికి భయపడి, మిల్లర్లకు లొంగిపోతున్నట్లు తెలిస్తోంది. మరోవైపు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కస్టోడియన్ అధికాలు కొంత మంది మిల్లర్లకు అనుకూలంగా మారి, మిల్లర్లుకు కావాల్సిన అధనపు ధాన్యాన్ని రైతుల నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రవాణా ఏర్పాట్లను నేరుగా అధికారులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కస్టోడియన్ వ్యవస్థను సమీక్షించి, దానిపై ప్రత్యేకాధికారి పర్యవేక్షించే విధంగా చూస్తే, దాదాపుగా మిల్లర్లు అక్రమాలకు కొంత అడ్డుకట్ట పడే అవకాశాలు ఉంటాయని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది 3.37 లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండించారు. సుమారు 4.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు సుమారుగా 65వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. సంక్రాంతి సమీపిస్తున్న వేల, పెద్దఎత్తున రైతులు నూర్పులు వేసుకుని ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉన్నారు. కానీ మిల్లర్లు వద్ద అధనపు కేజీల పంచాయితీ వల్ల ధాన్యం మిల్లులుకు వెళ్ళిన దించుకునేందుకు మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. రైతులే రవాణా వాహనాలు ఏర్పాటు చేసుకుని ధాన్యం మిల్లులకు పట్టుకెలుతున్న తరుణంలో ధాన్యం దించుకోడంలో జాప్యం జరగడంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మిల్లర్లు కావాలని అధనపు కేజీల డిమాండతో మంకుపట్టు పట్టి, రైతుల కచ్చితంగా ధాన్యాన్ని దించుకోవాలని పేచీకి దిగుతున్నారు. దీంతో అని వార్యంగా మిల్లర్లు డిమాండ్‌కు రైతులు లొంగిపోవాల్సిన పరిస్థితి దాపరిస్తోందని గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం తొలి నుంచీ రైతులను, మిల్లర్లను కలవనీయకుండా అధికారులే ధాన్యం కొంటారని చెప్పుకొస్తుంది. రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం భరిస్తుందని చెప్పినా, వాహనాలు ఏర్పాటు చేసుకునే భాధ్యత రైతులే పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రవాణా వాహనాలు ఏర్పాటు మండల అధికారులకు అప్పగిస్తే, మిల్లరతో నేరుగా అధికారులే మాట్లాడుకునే పరిస్థితి ఏర్పడి, అనివార్యంగా రైతుకు మిల్లరకు సంబంధం లేకుండా చేయొచ్చు. ప్రభుత్వం చెప్పిన విధంగా మిల్లర్లకు రైతులను కలవనీయకుండా చేయాలంటే, ఖచ్చితంగా అధికారులే రవాణా వాహనాలు ఏర్పాటు చేసుకుని, ఆర్బికే కేంద్రాల నుంచి నేరుగా ధాన్యం మిల్లర్లకు వెళ్లేలా చూడాలి. దీంతో రైతుకు మిల్లులుకు సంబంధం ఉండదు. అప్పుడు మిల్లర్లు అధనపు కేజీలు డిమాండ్ రైతుల నుంచి పొందే అవకాశం ఉండదు. కాబట్టి ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వాహనాలు ఏర్పాటు భాధ్యత అధికారులకు అప్పగించే చర్యలు చేపట్టాలని రైతులు, రైతు సంఘల ప్రతినిధులు కోరుతున్నారు. మరోవైపు రవాణా ఛార్జీలు ప్రభుత్వం భరిస్తుందని చెప్పినప్పటికీ, అవి ఏ కోశానా సరిపోవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ధాన్యాన్ని గోనె సంచులకు ఎత్తుతున్న రైతులు

మిల్లర్లకే కొమ్ము కాస్తున్న కస్టోడియన్ అధికారులు

మిల్లర్లు వద్ద రైతులకు సమస్య తలెత్తితే, వెంటనే ప్రభుత్వం నియమించిన కస్టోడియన్ అధికారులుగా ఉన్న రెవెన్యూ, సివిల సప్లయి అధికారులు జోక్యం చేసుకోవాలి. కానీ కొంతమంది అధికారులు జోక్యం చేసుకుని, రైతుల నుంచి అధనపు ధాన్యం ఇప్పించే విధంగా సహకరిస్తున్న పరిస్థితి. ధాన్యం దించుకోవాలంటే అధనపు ధాన్యం, డబ్బులు చెల్లించడం ఒక్కటే మార్గమని చెబుతున్న అధికారులు ఎక్కువయ్యారు. ఈ నేపథ్యంలోనే రైతులు అనివార్యంగా ఎందుకొచ్చిన గొడవని అధనపు ధాన్యం చెల్లించి ధాన్యం దించుకుంటున్నారు. కస్టోడియన్ అధికారుల తీరుపై సమీక్షించి, ఆ వ్యవస్థ పై ఎక్కడికక్కడ నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు. అధనపు ధాన్యం డిమాండ్ వచ్చినపుడు, మిల్లరుతో చర్చించి, ధాన్యం దింపాల్సిన అధికారులే మిల్లరుకు కొమ్ముకాస్తే, రైతులు ఏం చేయలేని పరిస్థితి ఎదురవుతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కస్టోడియన్ వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ప్రత్యేకాధికారి పర్యవేక్షణ అవసరమని రైతులు బావిస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. క్రైస్తవులంతా ఉదయాన్నే చర్చికి చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం క్రీస్తు జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి క్రీస్తు నేడు పుట్టెను హలేలూయా అంటూ నినాదాలు చేసారు. గ్రామాల్లో క్రైస్తవులు ర్యాలీలు చేస్తూ క్రీస్తు భోదనలు వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని యుఆర్‌పిఇఎఫ్ చర్చిలో పాస్టర్ ఎం. జీవన్ కుమార్ క్రిస్మస్ ప్రసంగం చేసారు. ప్రేమ, దయ, కరుణ యేసు క్రీస్తు యొక్క లక్షణాలు అని వివరించారు. పలు చర్చిల్లో పేదలకు బట్టలు పంపిణీ చేసారు. పూసపాటిరేగ చర్చిలో సర్పంచ్ టొంపల సీతారాం, మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు, పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: క్రీస్తు బోధనలు అనుసరణీయమని షాలెం ప్రార్థన మందిరం క్రీస్తు దాసు అన్నారు.


పూసపాటిరేగ.. ప్రసంగం చేస్తున్న జీవన్ కుమార్

మండలంలోని సంకిలి, ఉంగరాడ మెట్ట, దేవుదల, కొమిరి, వెంకటాపురం, బూరాడ తదితర గ్రామాల్లో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అని అన్నారు. ప్రేమత్వాన్ని పంచిపెట్టే ఏసుక్రీస్తు ఈ లోకానికి రక్షకుడని అన్నారు. ముందుగా ఏసుక్రీస్తు బోధనలు అందరికీ వివరించారు. యువత నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల నుంచి విశ్వాసకులు ప్రార్థన మందిరాలకు చేరుకుని ప్రార్థన చేశారు.

అనారోగ్యంతో కాంట్రాక్టు కార్మికుడు మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడు అంతరిపల్లి అప్పారావు అనారోగ్యంతో ఆదివారం మరణించారు. అప్పారావు భౌతికకాయాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు పొట్నూరు శంకరరావు సందర్శించి, నివాళులర్పించారు. అప్పారావుతోపాటు ఇటీవల మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. నివాళులర్పించిన వారిలో జి.శంకర్రావు, బంగారు, యుగంధర్, జె.రామారావు తదితరులున్నారు.


అప్పారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శంకరరావు, కార్మికులు


ఆదిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిరాజుకు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యడ్ల ఆదిరాజు 54వ జయంతిని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం యడ్ల ఆదిరాజు అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుంకర్ సతీష్ కుమార్, రాష్ట్ర ట్రైనింగ్ సెల్ చైర్మన్ డి.శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, రెహమాన్, షరీప్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు పి.రాజు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, తెలుగు సూరిబాబు, చిలక రాజు, గుజ్జ రాజు పాల్గొన్నారు.

ప్రబంధ రచనకు ఆద్యుడు ఎర్రాప్రగడ

ప్రజాశక్తి- రాజాం

భారత అరణ్య పర్వసేషాన్ని రచించిన ఎర్రాప్రగడ ప్రబంధ రచనకు ఆద్యుడని ఒమ్మి రమణమూర్తి తెలియజేశారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 95వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రమణమూర్తి 'భారత రచనలో ఎర్రన పాత్ర' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేశారు. ధర్మ వ్యాధోపాఖ్యానం, సావిత్రి చరిత్ర వంటి ఘట్టాలను ప్రబంధ పద్ధతిలో ఎర్రన రాశాడని గుర్తు చేశారు. నన్నయ, తిక్కనల బాణీలో ఎర్రన భారతాన్ని రచించి కవిత్రయంలో ఒకడయ్యాడని వివరించారు. లేకపోతే భారతానికి అంత సమగ్రత, సంపూర్ణత రాదని ఆయన ఉద్ఘాటించారు. ఇది కాక నృసింహ పురాణం, హరి వంశం, రామాయణం కూడా ఈయన రచించాడని, ఈయన ప్రాచీన సాహిత్యంలో గొప్ప కవి అని రమణమూర్తి ప్రశంసించారు. అనంతరం రమణమూర్తిని రా.ర.వే సభ్యులు ఘనంగా సన్మానించారు. నేతేటి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, కొత్తా సాయి ప్రశాంత్, డాక్టర్ ఆల్తి మోహన్‌రావు, సమతం మహేశ్వరరావు, రాజాపు శాంతారావు, పెంకి దయానిధి నాయుడు, శాసపు సత్యనారాయణ, బొంతు సూర్యనారాయణ, ఉరిటి గున్నేశ్వర రావు, పడాల కవీశ్వర రావు, బోనంగి జగన్నాథరావు, మజ్జి నాగరాజు, గ్రంధి సాయి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


రమణ మూర్తిని సత్కరిస్తున్న సభ్యులు

ఘనంగా ఎంవిజిఆర్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి- డెంకాడ

చింతలవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా ముగిశాయి. రజతోత్సవ వేడుకల్లో భాగంగా కళాశాల ఆవరణలో విద్యార్థుల కేరింతల నడుమ కల్చరల్ క్లబ్ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఎంవిజిఆర్ నిర్వాహకులు పి.సునీలా గజపతిరాజు సమక్షంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన సునీలా గజపతిరాజు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మరింత ఉత్తేజాన్ని నింపుతాయన్నారు. అనంతరం ఐఐఎస్‌టి తిరువనంతపురం సీనియర్ ప్రొఫెసర్ రిజిస్ట్రార్ డాక్టర్ కృష్ణ మూర్తి, కామ్‌టెక్ సొల్యూషన్స్ సిఇఒ విపిఎన్ రాజు, జెఎన్‌టియు -గురజాడ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జివిఆర్ ప్రసాద రాజు చేతులు మీదుగా గత 4 సంవత్సరాల బ్యాచ్ టాపర్లకు బంగారు పతకాలు, నగదు బహుమతులు అందించారు. ఎంవిజిఆర్ 25 సంవత్సరాల జర్నీ సావనీర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సునీల గజపతిరాజు జివిఆర్ ప్రసాద్ రాజును సత్కరించారు.

ఆకట్టుకున్న నృత్యాలు, కామెడీ స్కిట్‌లు

రజతోత్సవాల్లో భాగంగా పూర్వ, ప్రస్తుత విద్యార్థులు చేసిన నృత్యాలు, కామెడీ స్కిట్‌లు ఆకట్టుకున్నాయి. అందమైన పాటలు, నృత్యాలతో కల్చరల్ నైట్ నిర్వహించి రజతోత్సవ వేడుకలను ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో కళావాల ప్రిన్సిపల్ కెవిఎల్ రాజు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది, ప్రస్తుత విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థిని

ఘనంగా బైరెడ్డి విగ్రహావిష్కరణ వార్షికోత్సవం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కీర్తి శేషులు బైరెడ్డి సూర్యనారాయణ విగ్రహావిష్కరణ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, మేజర్ పంచాయతి మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా బైరెడ్డి సూర్యనారాయణ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా వక్తలు మట్లాడుతూ కీర్తి శేషులు బైరెడ్డి సూర్యనారాయణ నిరాడంబంగా జీవితాన్ని గడిపి గ్రామాన్ని, మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించారని కొనియాడారు. తన రాజకీయ జీవితంలో ఎటువంటి మచ్చలేకుండా నిస్వార్ధంగా ప్రజా సేవ చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పదవులతో సంబంధం లేకుండా టిడిపికి మండలంలో పట్టుకొమ్మగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పల నాయుడు, యువ నాయకులు అట్టాడ శ్రీధర్, కాళ్ళ రాజ శేఖర్, బైరెడ్డి కళ్యాణ చక్రవర్తి, చందక శంకర రావు, గంటా పాపారావు, బైరెడ్డి సతీష్, తివనాని అప్పారావు, బైరెడ్డి రమణ, నక్కా రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టిడిపి నాయకులు

నిర్ధిష్టమైన సమాచారం ఉండాలి

ప్రజాశక్తి - గుర్ల

సామాజిక మాధ్యమాలకు చేరవేసే సమాచారం నిర్ధిష్టంగా తగిన ఆధారాలతో ఉండేలా చూడాలని జిల్లా ఐటిడిపి కన్వీనర్ విమలారాని అన్నారు. ఆదివారం మండలంలోని ఎస్‌ఎస్‌ఆర్ పేట దగ్గర దత్త ఎస్టేట్‌లో ఐటిడిపి ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు, ప్రకాశంతో సహ పలు జిల్లాల ఐటిడిపి కన్వీనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్లు చిన్ని, రాజేష్ మాట్లడుతూ ఐటిడిపి కన్వీనర్లు పై అధికార పార్టీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వం ఎన్ని వేధింపులకు దిగినా టిడిపిని పటిష్ట పరిచేందుకు తమ కృషి ఆగదన్నారు. టిడిపిని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి, నెల్లిమర్ల, విజయనగరం, భోగాపురం నియోజకవర్గం నాయకులు కె. త్రిమూర్తులు రాజు, వెన్నె సన్యాసి నాయుడు, కె. సాంబశివ రాజు, కర్రోతు బంగారు రాజు, చీపురుపల్లి నియోజకవర్గం ఐటిడిపి కన్వీనర్ నాగులపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న టిడిపి నాయకులు

నగర పంచాయతీలో 300 పింఛన్లు కట్!

నెల్లిమర్ల : నగర పంచాయతిలో 300పింఛన్లు నిలిపేస్తున్నట్లు నోటీసులు రావడంతో పింఛన దారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నెల్లిమర్లలో 200, జరజాపు పేటలో 100 పింఛన్లు నిలిపి వేసినట్లు ఇప్పటికే వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి వారికి నోటీసులు అందించారు. దీంతో ఆయా పింఛన్ దార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంటి కొలతలు పరిధి దాటి ఉన్నాయని, కరెంట్ బిల్లు అధికం, ఆదాయ పన్ను చెల్లింపు జరుగుతుందన్న పేరిట పింఛన్లు నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న తమకు అర్ధంలేని నిబంధనలతో పింఛన్లు నిలిపి వేయడం దారుణమని, జగన్మోహన్ రెడ్డి చెప్పిన రాజన్న రాజ్యం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ముసుగులో అర్హత ఉన్న పేదలకు పింఛన్లు తొలగించడం భావ్యం కాదని చెబుతున్నారు. నిలుపుదల చేసిన పింఛన్లు పునరుద్ధరించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పింఛనదారులు హెచ్చరిస్తున్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి

బొబ్బిలి : క్రిస్మస్ వేడుకలు కోసం విశాఖ నుంచి బొబ్బిలి వస్తున్న పట్టణానికి చెందిన రాజాన చంటి ఆదివారం కాలు జారీ రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. చాలా కాలంగా విశాఖలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ భార్య సంధ్యారాణి, ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. తన కుటుంబంతో కలిసి బొబ్బిలికి కోర్భ ట్రైన్‌లో వస్తుండగా గున్నతోటవలస సమీపంలో ప్రమాదవాస్తు ట్రైన్ నుంచి జారి కిందకు పడిపోవడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ బి.ఈశ్వరావు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు.

పరుపుల దొంగ అరెస్ట్

విజయనగరం టౌన్ : విజయనగరం పట్టణం భగవతి హోం నీడ్ ఫర్నీచర్ షాపు గోడౌన్‌లో పరుపులు చోరికి పాల్పడిన విజయ్‌ను అరెస్టు చేసినట్లు సిఐ వెంకటరావు తెలిపారు. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో దొంగ వివరాలను వెల్లడించారు. షాపు యజమాని బి.శ్రీను భగవత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 1వ పట్టణ పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో గోడౌన్ నుండి పరుపులను చోరీ చేసి, ఇతరులకు అమ్మేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన గాజులరేగకు చెందిన విజయ్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుండి 24 పరుపులను తిరిగి రికవరీ చేసినట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. కేసు దర్యాప్తులో క్రియాశీలకంగా పని చేసిన ఎస్ఐ భాస్కరరావు, సిబ్బందిని సిఐ అభినందించారు.

గుండాలపేటలో అగ్ని ప్రమాదం

రెండు పూరిళ్లు, పశువుల శాల దగ్ధం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ పంచాయతీ పరిధిలోని గుండాలపేట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు, ఒక పశువుల శాల, టేకు కర్రలు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కార్ల సత్యం ఇంట్లో మొదట ఈ అగ్ని ప్రమాదం ప్రారంభమైంది. ఆ పక్కనే ఉన్న కాళ్ళ నారాయణ ఇంటికి, పశువుల శాలకు ఈ మంటలు వ్యాపించి కాలి బూడిదయ్యాయి. కాళ్ల నారాయణకు చెందిన టేకు కర్రలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ. 4లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి గలకారణాలు తెలియరాలేదు. విజయనగరానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఆ గ్రామ వైసిపి నాయకుడు రమణ బాధితులకు సహాయ సహకారాలు అందజేస్తున్నారు.


డెంకాడ: మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


రేగిడి: సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామంలో సుమారు 20 ఎకరాలు వరి కుప్పలు, వరిచేల నూర్పు యంత్రం, ట్రాక్టర్ అగ్ని ప్రమాదంలో ఆహుతి అయ్యాయని, సుమారు 20 లక్షల పైబడి రైతులుకు నష్టం వాటిల్లిందని రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు నారు జనార్ధన రావు, రౌతు గణపతి రావు, అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంతో కూడిన రైతు సంఘం ప్రతినిధి బృందం అగ్ని బాధిత కుటుంబాలను పరామర్శించి, ప్రమాద స్థలాన్ని పరిశీలించింది. అగ్ని బాధితుల్లో దూబ దాలినాయుడు 11 ఎకరాలు, దూబ సంఘం నాయుడు 2.20 ఎకరాలు, గురవాన ఫకీర్ నాయుడు 2.5 ఎకరాలు, గురవాన సంఘం నాయుడు 2.4 ఎకరాలు, గుండెల ఆనందరావు 2.6 ఎకరాలు కాలి బూడిదయ్యాయని సర్వం కోల్పోయిన పేద రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదికలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం ద్వారా పరిహారం ఇచ్చే విధంగా కృషి చేస్తామని బృందం అగ్ని బాధితులకు హామీ ఇచ్చింది.